క్లుప్తంగా

భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు

చొప్పదండి: పట్టణంలోని పడమటివాడ రెడ్డి సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేశామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మంగళవారం రైతులతో కలిసి తన నివాసంలో సమావేశం ఏర్పాటు చేశారు. రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లోక రాజేశ్వర్ రెడ్డి, కొత్తూరి మహేశ్, గుర్రం మల్లారెడ్డి, నలుమాచు రామక్రిష్ణ, భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిమ్మత్‌నగర్ గ్రామ బీజేపీ బూత్ కమిటీ



నియామకపత్రం ఇస్తున్న కరుణాకర్‌రెడ్డి

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామ బీజేపీ బూత్ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా మోర్తాల రఘువరన్, ప్రముఖ్‌లుగా నల్ల కోమాల్‌రెడ్డి, బొంతల అమరేందర్, వలీమహ్మద్, కృష్ణారావు, బొంతల నాగరాజు, మారం మల్లారెడ్డి, మేక రాకేశ్, మహిళా ప్రముఖ్‌గా స్వరూపను ఎన్నుకున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి మారం తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్, హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారం తిరుపతి రెడ్డి, లకోట వెంకన్న ఉన్నారు.

ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా ..

రామడుగు: బీజేపీ రామడుగు మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా బొమ్మకంటి భాస్కరాచారి నియామకమయ్యారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి మంగళవారం నియామక పత్రం అందజేశారు.

మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

చొప్పదండి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం వెంటనే ఏర్పాటు చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు గుర్రం రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. మొక్కజొన్న రైతులు వడగండ్ల వాన గండం ఎదుర్కొని వచ్చిన కొద్దిపాటి దిగుబడి అమ్ముకోవడానికి మార్కెట్‌కు వెళ్తే వ్యాపారులు ధరలు తగ్గించి రైతులను నిండా ముంచుతున్నారని వాపోయారు. మొక్కజొన్న ధర క్వింటాల్‌కు రూ. 2,300 నుంచి రూ.1,800కు పడిపోవడం దారుణమన్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పందించి మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయించి రైతులను ఆదుకోవాలని, వ్యాపారుల దోపిడీని అరికట్టాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

జమ్మికుంట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫైర్‌మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని భారత్ గ్యాస్ గోడౌన్, రామన్నపల్లిలోని ఎస్ఆర్ పెట్రోల్‌బంక్‌ల వద్ద వాహనాదారులకు, బంక్‌లో పనిచేసే వారికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మంటలను ఆర్పివేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్స్, కరపత్రాల పంపిణీ, పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో డ్రైవర్, ఆపరేటర్ రవీందర్, ఫైర్‌సిబ్బంది ఎండీ తాబ్రేజ్, శ్రీనివాస్, హోంగార్డు సంతోష్ పాల్గొన్నారు.

ప్రారంభించక పరేషాన్..!

- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం
- వారం క్రితమే మొదలైన వరి కోతలు
- కమ్ముకుంటున్న మేఘాలు.. ఆందోళనలో అన్నదాతలు
- ధర తగ్గిస్తున్న ప్రైవేటు వ్యాపారులు



రాగంపేటలోని కొనుగోలు కేంద్రంలో పేరుకుపోతున్న ధాన్యం రాశులు

చొప్పదండి: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ మూడో వారం పూర్తి కావస్తున్నా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఊసే లేక పోవడంతో కేంద్రాల ధాన్యం ఆరబోసిన రైతులకు ఎదురుచూపు తప్పడం లేదు. మూడు రోజులుగా కమ్ముకుంటున్న మేఘాలు, అక్కడక్కడ అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. అకాల వర్షాలతో వరిపంట చేతికందకుండా పోతుందని పంటను కోసేందుకు రైతులు ఆరాటపడుతున్నారు. దీంతో హార్వెస్టర్లకు గిరాకీ పెరిగింది. కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోని కల్లాలకు తరలిస్తుండటంతో ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి. ఎండలకు ధాన్యం రెండు మూడు రోజుల్లోనే నిబంధనల మేరకు తేమ శాతం చూపిస్తోంది. కానీ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, ప్రతిపక్షాలు, అధికారులు స్పందించక పోవడంతో రైతులకు దిక్కు తోచని పరిస్థితి ఎదురైంది. వచ్చేవారం వరకు కేంద్రాలను ప్రారంభించే పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు.

ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక పోవడంతో చొప్పదండిలోని మార్కెట్ యార్డులో ప్రైవేటు వ్యాపారులకు రైతులు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే సుమారు రెండు వందల వరకు తక్కువ ధరకు ధాన్యం అమ్ముకుంటున్నామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తే తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉండేదికాదని, ఇప్పటికే వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులు కాస్తో కూస్తో చేతికి వచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి కష్టాలు పడుతున్నామని వాపోతున్నారు. ఐకేపీ కంటే కొనుగోళ్లలో ముందుండే చొప్పదండి పీఏసీఎస్ కేంద్రాలు కూడా ఇంకా ప్రారంభం కాకపోవడం రైతులు పరేషాన్‌లో ఉన్నారు. ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చొరవ తీసుకొని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం కుప్పలుగా వచ్చాయి. నిబంధనల మేరకు ఉన్న ధాన్యం రాశులను వెంటవెంటనే కొనుగోలు చేయాలి. కుప్పలు ఖాళీ చేస్తే కొనుగోలు కేంద్రాల్లో స్థలం దొరుకుతుంది. మబ్బులు కమ్ముకుంటున్న నేపథ్యంలో ఆందోళనగా ఉంది. అధికారులు స్పదించి కేంద్రాలు ప్రారంభించాలి.

– గుర్రం రాజశేఖర్ రెడ్డి, చొప్పదండి

జాప్యం చేయొద్దు



మూడు రోజులుగా మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఇటీవల వడగండ్ల వానతో నష్టపోయాం. మళ్లీ వర్షాలు వస్తే రైతులను దేవుడు కూడా కాపాడలేడు. వర్షం భయాని కే ముందస్తుగా వరికోతలు ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే అమ్ముకోవడానికి అనుకూలంగా ఉంటుంది. కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయొద్దు.

– గుంటి రాజు, చొప్పదండి

త్వరలో ప్రారంభిస్తాం

కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఐకేపీ కార్యక్రమాలు పూర్తి కాగానే ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారిస్తాం. గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని సమాయత్తం చేస్తున్నాం. కొనుగోలు కేంద్రాలకు మిల్లుల కేటాయింపు కూడా పూర్తయింది.

– నర్మద, ఏపీఎం, ఐకేపీ

సమాచారం

జీపీ కార్యదర్శులకు అవార్డులు

గన్నేరువరం: కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ చేతుల మీదుగా మంగళవారం గన్నేరువరం పంచాయతీ కార్యదర్శి వి. వెంకటేశ్ అవార్డు అందుకున్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీలకు జిల్లాలోనే అత్యధికంగా పనిదినాలు కల్పించినందుకు అవార్డును అందుకున్నారు. కార్యదర్శిని కలెక్టర్ శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు. గ్రామాభివృద్ధిలో ముందుకుసాగాలన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె గ్రామంలో వైకుంఠధామం నిర్వహణ చేపడుతున్నందుకు కలెక్టర్ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శి శ్రీదర్ అవార్డు అందుకున్నారు.

తిమ్మాపూర్: సెగ్రిగేషన్ షెడ్ కేటగిరీలో తిమ్మాపూర్ గ్రామపంచాయతీ అత్యుతమ పనితీరుకు పంచాయతీ కార్యదర్శి కోరుకంటి మహేందర్‌రావును కలెక్టర్, జెడ్పీ సీఈవో, డీఆర్డీవో అవార్డుతో సత్కరించారు. చెత్త సేకరణ, కంపోస్ట్ ఎరువు తయారీ, అమ్మకంలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని, ఉపాధి హామీ కూలీలకు అత్యధిక పనిదినాలు కల్పించినందుకు పాలంపల్లి జీపీ కార్యదర్శి వెంకట్‌రెడ్డిని, పర్సన్ డేస్ అచీవ్‌మెంట్‌కు టీఏ హరీశ్‌ను సత్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ఇల్లందకుంట: భూసంబంధిత న్యాయపరమైన అంశాలపై జరిగే అవగాహన సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గుర్రం రజిత కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో అగ్రిలీగల్ ఎయిడ్ క్లినిక్ జిల్లా జడ్జి త్వరలో ప్రారంభించనున్నారని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, రైతుబంధు కోఆర్డినేటర్ సభ్యులు భూసంబంధిత న్యాయసలహాలను తెలుసుకోవాలని కోరారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని పోస్టాఫీస్ కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన చిన్న మొత్తాల పొదుపు పథకం మహిళా సమ్మాన్ సేవింగ్స్ ప్రారంభమైందని హుజూరాబాద్ పోస్ట్‌మాస్టర్ ఇల్లందుల సమ్మయ్య తెలిపారు. దేశంలోని ప్రతి మహిళ/బాలిక పథకంలో కనిష్టంగా రూ. వెయ్యి నుంచి రూ. 2 లక్షల వరకు డబ్బులు జమ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పోస్టుమాస్టర్ యు. మహేందర్, అకౌంటెంట్ పి.అమర్నాథ్‌రెడ్డి, ఎస్‌బీసీసీఎం రవి, ఎస్‌బీసీవోఏ సురేశ్ తదితరులు ఉన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి,మైలారం, గన్నేరువరం గ్రామాల్లో ఐకేపీ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభించనున్నారని ఐకేపీ ఏపీఎం లావణ్య మంగళవారం తెలిపారు. గునుకులకొండాపూర్, గోపాల్‌పూర్, యాస్వాడ, చొక్కారావుపల్లె, చాకలివానిపల్లె గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలోని కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిచడంతోపాటు వివిధ గ్రామాల్లో కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న తెలిపారు.

‘కంటి వెలుగు’ సద్వినియోగం చేసుకోవాలి

గంగాధర: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వేముల దామోదర్ అన్నారు. మండలంలోని కాసారం గ్రామంలో మంగళవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో అర్హులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరం ఉన్న వారికి మందులతో పాటు, కళ్లద్దాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు.

శంకరపట్నం: మండలంలోని గద్దపాక గ్రామంలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ విజయ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కంటి పరీక్షలు చేసి కళ్లద్దాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, కల్వల సర్పంచ్ భద్రయ్య, వైద్యులు వేణుగోపాల్, కీర్తన, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నేడు నవాబుపేట్‌లో కంటి వెలుగు ప్రారంభం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించనున్నామని చిగురుమామిడి మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ తెలిపారు. మంగళవారం చిగురుమామిడిలో మాట్లాడారు. అర్హులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కంటిపరీక్షలు అనంతరం కళ్లద్దాలు అందిస్తామని తెలియజేశారు.

వాహనదారులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

హుజూరాబాద్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ వెంకట్‌రెడ్డి, రోడ్డు సేఫ్టీ వింగ్ డీఎస్పీ చంద్రభాను అన్నారు. పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదం జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు బొల్లం రమేష్, సురేష్, ఎస్ఐలు జి.రాజన్న, ఆసిఫ్,యూనీస్ అలీ, పోలీసు సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొండాపూర్‌లో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతోకృషి చేస్తూ పండిన పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం కొండాపూర్, చిగురుమామిడి, లంబాడిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చిగురుమామిడి రైతువేడికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వినీత, జెడ్పీటీసీ రవీందర్, తహసీల్దార్ ముబీన్‌అహ్మద్, ఎంపీడీఓ నర్సయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రమణారెడ్డి, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రజితకృష్ణమాచారి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మల్లేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు కొంరయ్య, మండల కోఆర్డినేటర్ తిరుపతి, సర్పంచులు, ఏపీఎం సంపత్, సింగిల్‌విండో సీఈవో నర్సయ్య, ఐకేపీ సీసీలు సత్యనారాయణ, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రి స్కూల్ మేళా



ప్రి స్కూల్ మేళా నిర్వహిస్తున్న అంగన్‌వాడీటీచర్లు

వీణవంక: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ప్రి స్కూల్ మేళా ఆకట్టుకుంది. చిన్నారులు ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలను ప్రదర్శించారు. క్యాట్‌వాక్, నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామలాదేవి హాజరై మాట్లాడారు. ప్రైవేట్‌కు ధీటుగా అంగన్‌వాడీ సెంటర్లలో విద్యా బోధన జరుగుతుందని, అన్ని మౌలిక వసతులు ఉన్నాయని పేర్కొన్నారు. చిన్నారులను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సెంటర్‌ల ద్వారా పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అన్నపూర్ణ, శ్రావణి, వినోద ఉన్నారు.

‘రైతులు లేకుండానే ధరల నిర్ణయం’

శంకరపట్నం: రైతులు లేకుండానే సీడ్ వ్యాపారులు ధాన్యం ధరలు నిర్ణయించారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మరెడ్డి రాజిరెడ్డి ఆరోపించారు. కేశవపట్నంలో మంగళవారం మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారని, తాలు, తూకం, తరుగు పేరిట కోతలు విధిస్తున్నారని పేర్కొన్నారు. సీడ్ కంపెనీల ధాన్యం డబ్బులు రావడానికి రెండు నుంచి మూడునెలల సమయం పడుతుందని, రైతులు, రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి ధరలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

వర్షపు నీటిని నిల్వచేయాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని సదాశివపల్లి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నీటి ఆవశ్యకత గూర్చి వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం రాజమౌళి వర్షపు నీరు వృధాకాకుండా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలన్నారు. అనంతరం నీటి సంరక్షణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం

గంగాధర: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గంగాధర ప్రాజెక్టు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా జి. రమాదేవి, అధ్యక్షురాలిగా డి. సుజాత, ప్రధాన కార్యదర్శిగా దేవమణి, కోశాధికారిగా ఎ. విజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశానికి జిల్లా కన్వీనర్ అనసూయ హాజరై మాట్లాడారు. సమస్యలను సంఘం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. అనంతరం సీడీపీవో కస్తూరిని కలిశారు. కార్యక్రమంలో రామడుగు, గంగాధర, చొప్పదండి మండలాల అధ్యక్షులు ఆర్. భాగ్యరాణి, కె. లక్ష్మి, లావణ్య సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు సీపీఐ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: పల్లె పల్లెకు సీపీఐ, ప్రజల వద్దకు సీపీఐ ప్రజా చైతన్య యాత్ర కరపత్రాన్ని మంగళవారం గన్నేరువరంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన ప్రజాచైతన్య బస్సు యాత్ర 27వ తేదీ వరకు కొనసాగుతుందని, 20న మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. యాత్రలో పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తంద్రా సదానందం, వెన్నం సురేశ్ పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశంలో బీజేపీ పాలన గాడి తప్పిందని, ప్రభుత్వాన్ని గద్దె దించడమే పార్టీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్‌రెడ్డి, అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బోనగిరి మహేందర్, మండల అధ్యక్షుడు కాంతాల అంజిరెడ్డి, నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, నాయకులు న్యాలపట్ల రాజు, కూన మల్లయ్య, గర్శకుర్తి శ్రీనివాస్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

గుంట భూమి ఉన్నా రైతుబీమా వర్తిస్తుంది

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



వంతడ్పులలో రైతుబీమా ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట/ఇల్లందకుంట: జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి రైతుబీమా ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. గుంట భూమి ఉన్నవారికి సైతం బీమా వర్తింప చేస్తూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఆయా గ్రామాల్లోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వారి ఇళ్లవద్దకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ–98 క్వాలిఫైడ్ టీచర్ల వినతి

హుజూరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ–98 క్వాలిఫైడ్ టీచర్లకు ఉద్యోగాలు ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా డీఎస్సీ–98 క్వాలిఫైడ్ టీచర్లకు ఉద్యోగాలు కల్పించే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం కౌశిక్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డీఎస్సీ–98 క్వాలిఫైడ్ టీచర్ల సంఘం అధ్యక్షుడు పిట్టల సంజీవ్, ఎంబడి శంకర్, పాడి విజయపాల్ రెడ్డి, దోమల చంద్రమౌళి, మాడిశెట్టి వీరన్న, శ్రీనివాస్ రెడ్డి, మంచి కట్ల సమ్మయ్య పాల్గొన్నారు.

ఏపీఎంకు వీవోఏల సమ్మె నోటీస్



ఏపీఎం సుధాకర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న వీవోఏలు

శంకరపట్నం: వేతనాలు పెంచాలని వీవోఏలు మంగళవారం శంకరపట్నం ఏపీఎం సుధాకర్‌కు సమ్మె నోటీస్ అందించారు. మహిళా సంఘాల బలోపేతం, ప్రభుత్వ పథకాలు అమలు, వివిధ కార్యక్రమాలపై సర్వే చేస్తున్నామని, వేతనం పెంపు, ఆరోగ్యబీమా, ఉద్యోభద్రత, ఐడీకార్డు, సెర్ప్ ఉద్యోగలుగా గుర్తించాలని సమ్మె చేస్తున్నామని వీవోఏల సంఘం అధ్యక్షురాలు స్వరూప తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి, వనిత, శారద, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన

సైదాపూర్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని మంగళవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రెండో రోజు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరసన తెలిపారు. ప్రొబేషనరీ పూర్తయిన రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం లేదన్నారు.

ఆధ్యాత్మికం: వెండి కిరీటం బహూకరణ



చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం కరీంనగర్‌కు చెందిన పాపెట్ల రవీంద్రనాథ్, వసంత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రూ. 53 వేల విలువైన వెండి కిరీటం, రూ.12 వేల విలువ గల దీప కుందులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మండల పూజ సందర్భంగా రెండోవార్డు కౌన్సిలర్ మాదూరి శ్రీనివాస్, శ్రావణి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఆలయ నిర్వాహక ట్రస్టు సభ్యులు దండె లింగయ్య, దూస రాము, కటుకం మహేశ్, కొత్తపల్లి లక్ష్మణ్, దూస లక్ష్మీనర్సయ్య, కొల్లూరి ఆనందం, నలుమాచు రామక్రిష్ణ, లక్ష్మీరాజం, శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన



సూచనలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక

హుజూరాబాద్: పట్టణంలోని ఈద్గా కబ్రస్తాన్‌లో రంజాన్ పండుగ ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక పరిశీలించారు. ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్ సమ్మయ్య, ఇంజినీర్ సాంబరాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం తహసీల్దార్ మాధవి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేష్, ఎండీ.లాల్, రఫీఖాన్, ముస్తఫా, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముస్లింలు, తదితరులు పాల్గొన్నారు.